# ఉద్యోగ వాంఛ

## 1

వెంకట్రాయుడు పాతికేళ్ళ మనిషి. వాళ్ళ వూరి వీథి బడిలోనే చదువుకుని ప్రైమరీ పరీక్ష యిచ్చాడు. అంతతో సరి! చదువు కోటాకు వేసింది. గుండా భాయి జట్టుతో తిరిగి కొన్నాళ్ళు పెద్ద రౌడీ ననిపించుకున్నాడు. దిప్పకాయల్లో ఫస్టు రకం. కొన్నాళ్ళకి సంసార భారం తనమీదే పడ్డాది. ఏం జేస్తాడు యిక? వుద్యోగానికి చాలా ప్రయత్నించేడు. యెక్కడా దొరకలేదు. దొరికేదాకా వూరికే కూచుంటే కడుపు గడవడమెట్లా? తను పస్తు పడుకుంటే సరిపోతుందా? తల్లీ! పెళ్ళామూ యేమౌతారు? ఆలోచించి, ఆలోచించి రాయుడు స్వంత శేరి వ్యవసాయం పెట్టాడు. కాస్తో కూస్తో పండుతున్నాది. యెల్లాగో వుందీ అనక, లేదూ అనక కాలక్షేపం జరుగుతున్నాది. బుఱ్ఱ తిరుగుడు కూడా చాలా మట్టుకు తగ్గింది.

రాయుడుకి ఏమీ తృప్తిలేదు. వుద్యోగం చెయ్యాలని అతని పట్టుదల. ఎలాగన్నా సంపాదించి తీరాల్సిందే. ఎవరేనా పెద్ద వుద్యోగస్తులు ఆ వూరికి వస్తే, సప్లయి చేసినా, చెయ్యకపోయినా అటూ యిటూ తిరిగి హడావుడి చేస్తూ, చాలా కష్టపడి పని చేస్తున్నవాడిలా తోపించేవాడు అధికార్లకి. వాళ్ళ యెదుటనే మునసబుకీ, కరణానికీ కూడా యేవో సప్లయి పనులు పురమాయించేవాడు మహా పలుకుబడి వున్న వాడిలాగ. యిట్లాగే, తహసీల్దారు, మేస్ట్రీటు మొదలైన వారి దయ సంపాదించుకున్నాడు. సమయం చిక్కితే ఏదన్నా వుద్యోగం పారెయ్యరా అని అతగాడి వుద్దేశం. పోస్టాఫీసుకెళ్ళి తనకేమైనా కవరుత్తరాలు, ఉద్యోగస్థులు రాసినవి వస్తుంటాయేమో అని రోజూ చూశేవాడు.

ఎలాగైతేనేం వచ్చిందో సర్వీసు కవరుత్తరం ఒకనాడు. ఆ వూళ్ళో పోస్టుమేష్టరు అక్షరాలు కూడబలుక్కుని ఆ యింగిలీషు చిరునామా చదివి వెంకట్రాయుడికి యిచ్చేడు. రాయుడు ఆతురతగా అందుకుని పొంగిపోయేడు. రోజుకుంటూ తిరిగి దాన్ని పోస్టు మేష్టరుకిచ్చి 'యెవరిదెగ్గిర్నించి వచ్చిందో చూసి చెప్పండీ!' అని బతిమాలుకున్నాడు. తనకు ఆ మాత్రం యే, బీ, సీ, డీలూ రాకపోవడం వల్ల. అతను ఐదు నిమిషాలు పరకాయించి చూసి 'మేస్ట్రీటు గారి దగ్గర నుంచి' అని చెప్పాడు. రాయుడు వెంటనే అతని చేతిలోంచి ఆ కవరు లాక్కుని ఒక గంతు వేశాడు. పోస్టుమేష్టరు 'ఏమిటయ్యా సమాచారం!' అంటూ

వుండగా. 'చెప్తా మళ్ళీవొచ్చి' అని గాభరాగా యింటికి పరుగెత్తాడు. తన గదిలో ప్రవేశించి తలుపు గడియ వేసుకుని ఒక కిరసనాయిలు దీపం వెలిగించి (ఆ పూరింటి గదికి కిటికీలు లేవులెండి, తెరవడానికి) జాగర్తగా కవరువిప్పి లోపల కాగితం చూసేడు. దైవం రక్షించి అది తెలుగులోనే వుంది. అది ఒకసారి కాదు, పదిసార్లు చదువుకున్నాడు. పరమానంద సముద్రంలో మునిగిపోయి ఐదు నిమిషాలు స్పృహ తప్పిపోయాడు. తెలివి వచ్చాక 'అమ్మోయ్!' అని అంటూ ఈ ఇరుకు గదిలో వంటా పెంటా ఏం చేస్తారు? ఒక్క యేడాది వోపిక పట్టండి. యీలోపుగా యిక్కడే ఒక భవంతి లేవదీస్తాను.

బుచ్చెమ్మ – అదుగో! అదొకటి తలపెడితే నాకు వస్తువులూ వచ్చీటట్టే. ఎందుకు అబద్ధాలు మాటలాడడం?

రాయు – భవంతి కట్టించేమంటే ఎక్కువ సొమ్ము ఔతుందనా నీ వూహా! వెట్టి కూలీలు, వెట్టి కంసాళ్ళు, వెట్టి తాపీవాళ్ళు దమ్మిడీ ఖర్చులేకుండా పనిచేస్తారు. కలప వూరికే సంపాదించొచ్చు. ఇక దానికి డబ్బు ఎందుకు ఎక్కువ అవుతుందీ? పలుకుబడి వున్న వాడిని, నాకే కర్చవుతుందేమీ? వెట్టివాళ్ళు పని చెయ్యకపోతే ఎరగరు నా మజా.

బుచ్చె – బాగా వుంది! ఇక మనకేం లోటూ! కానీ మీ చేతికింద ఏదైనా పనికలిసివస్తే మా అన్నయ్యకి పని వేయించరూ? బియ్యే దాకా చదివి ఊరికే ఉన్నాడు. మీ పేరు చెప్పుకుని మావాళ్ళు హాయిగా బతుకుతారు.

రాయు – చూద్దాంలే అప్పటి సంగతి! చదువంటే – యేదో – చదువుకుంటారు గాని యీ, బియ్యేలకీ వీళ్ళకీ లోకజ్ఞానం అనేది తక్కువ.

బుచ్చె – దైవం రక్షించి మనకో కాయకాస్తే అది ఆడుకుందికి వో తొక్కుడు మోటారూ, బైస్కాలు బండీ కొంటారు కదూ!

రాయు – ఓస్! అవే అబ్బురమా! ఇంతెందుకూ! యీయేడాది, యిల్లయితే, మరో యేడులో గుర్రపు బుగ్గీ మనకి కొననూ?

బుచ్చె – (సంతోషంతో) యేం అదృష్టవంతురాలినమ్మా నేను? నా పూజలు యిన్నాళ్ళకి ఫలించాయి! యిక మాకేమిటి తక్కువ?

## 2

రాయుడు తల్లి వెంకమ్మ పెరటి పంచ దగ్గిర తులసి కోట పక్కని కూచుని వత్తివత్తులు వేస్తూ వుంటుంది. పక్కవీథి సుబ్బమ్మ 'వెంకమ్మక్కా! అని పిలుచుకుంటూ వస్తుంది. యిదివరకు ఆప్యాయంగా జవాబిచ్చి కూచోమని చెప్పే వెంకమ్మ పలకనన్నా పలకలేదు. సుబ్బమ్మ వెంకమ్మ పక్కన నుంచుని మళ్ళీ పిలిచింది.

వెంక - నువ్వటే సుబ్బీ! పరధ్యానంగా వున్నాను, మాట వినిపించడం లేదు! కూచోవే!

సుబ్బమ్మ - (కూచుని) ఏమే! చెప్పనన్నాలేదూ, మీ రాయుడికి ఉద్యోగమయిందనీ!

వెంక - (విసుగుతో) నిన్ననేగదటే కాగితం వస్తా. అప్పుడే యెక్కడ చెప్పేదే? ఏం లోకమమ్మా అప్పుడే యెలా పొక్కిపోయిందో!

సుబ్బ - తెలిస్తే యేమే. సంతోషించేవాళ్ళమే గాని, దుఃఖపడేవాళ్ళం కాదుగదా మేము!

వెంక - నీ సంగతి కాదే చెప్తున్నాను లోకం రీతి! ఎంత కష్టపడ్డాడనుకున్నావ్ ఆ వుద్యోగానికి! తొంభై ఒకటి కాదు, తొమ్మిది వందలు జీతం చేసినా ఆ కష్టానికి చాలదు. ఏమనుకున్నావో గానీ!

సుబ్బ - తొంభయ్యొకటా జీతం! ఏం అదృష్టవంతురాళ్ళమ్మా, అత్తా కోడళ్ళూనూ, మా అభాజనం బియ్యే చదివి కూడా యింట్లో కూచున్నాడు, పనీలేక బండలూ లేక. 'ఏమిరా! పనికి చూస్తున్నావురా' అంటే తెల్ల మొగం వేస్తాడు. అస్తమానం పెళ్ళాన్ని ఎదురుగుండా కూచోపెట్టుకుని కబుర్లు చెప్పమంటే చెబుతాడు. ఎందుకొచ్చిన కబుర్లు! మీవాడు ఆ యింగ్లీషు ఏమీ రాకపోయినా నూరురూపాయల వుద్యోగం యెడం చేత్తో సంపాదించేడు!

వెంక - ఎందుకే ఆ పీచుపీచు చదువులు! డబ్బు దండక్కి గానీ! ఏమిటి లాభం! యింతకీ అదృష్టముండాలిగాని చదువులేం పనిచేస్తాయే?

సుబ్బ - నిజమేనక్కా! మారోజులు యెలా తెల్లారతాయో అని బెంగపట్టుకుంది. ఉన్న మడి చెక్కలు వీడి చదువుకోసం బుగ్గిలో కలిపివేసేం. దారీ, తెన్నూ తోచలేదు.

వెంక - విచారించకే సుబ్బీ? మావాడితో చెప్పి యేదన్నా కిందపని కలిసొస్తే తప్పకుండా మీ వాడి సంగతి చూసేటట్టు చేస్తాను. ఆ మీద మీ అదృష్టం.

సుబ్బ - సరేనమ్మా! అలా ఏదేనా చేయిస్తివట్టాయనా, నీ మేలు మరిచిపోను. నా శరీరం నీకు చెప్పులు కుట్టియిస్తా. మరిచిపోకేం?

వెంక - ఎంత మాటన్నావే?

## 3

(రామారావు యిరవై రెండేళ్ళ మనిషి. బియ్యే పేసయి ఏడాది అయింది. ఎక్కడా ఉద్యోగం దొరక్క యింట్లోనే ఉన్నాడు. 'హిందూ' పత్రిక 'వాంటెడ్' కాలములు చూస్తూ నడవలో మడతకుర్చీలో కూచుని వుంటాడు, గదిగుమ్మానికెదురుగా, గదిలో అతని పెళ్ళాం పద్మ సింగారం పూర్తి చేసుకుని గుమ్మం దగ్గిర నిలబడి వుంటుంది).

పద్మ – ఎవర్తికేనా కలుగుతుందదృష్టం, నాలాంటి దరిద్రదేవతకి తప్ప!

రామా – (పత్రిక ముడిచి) ఏమొచ్చిందేమిటిప్పుడు!

పద్మ – పెళ్ళయి నాలుగేళ్ళయింది – కాపరానికొచ్చి యేడాదిపైగా దాటింది. నగా, నట్రా, ముద్దూ, ముచ్చటా ఏమన్నా తీరాయి! మీరే ఆలోచించండి. బుచ్చెమ్మ చెప్పింది, వాళ్ళాయనకి పెద్ద వుద్యోగం అయిందట! భవంతి కట్టేస్తారట! ఒళ్ళు బంగారం మలామా చేయిస్తాడట! బగ్గీలూ, మోటారులూ కొంటాడట! దానిదే అదృష్టంగాక! మీరు పెద్ద చదువులు చదివినా కానీ వుద్యోగమేనారాలేదు.

రామా – ...............

పద్మ – నగా, నట్రా సంగతీ అలా ఉండనీండి. మీకు తోడు నేను కూడాను వీళ్ళ పీకెమీదికి. ప్రతిరోజూ రుసరుసలే పట్టెడన్నానికి! ఏదేనా చిన్నపనేనా సంపాదిస్తే యీ బాధ తప్పిపోతుంది.

రామా – ...............

పద్మ – బుచ్చెమ్మ చెప్పిందిలెండి! ఏదేనా, ఆయన కింద పనికలిసొస్తే మీకు యిప్పిస్తుందట!

రామా – ఎవరి సంగతే చెప్తున్నావు నువ్వు!

ఇంతట్లో రామారావుతల్లి సుబ్బమ్మ వస్తుంది. కోడలు గదిలోకి పోతుంది. సుబ్బమ్మ రామారావుని చూసి.

'ఏమిరా రామం! వొట్టి కాగితాలేనా, యేమన్నా వుద్యోగాలు ఖాళీపడినవున్నాయా! ఎందుకురా డబ్బుఖర్చుకి, ఆ చేటకాగితాలూ?' అంటే 'యిందులోనే వున్నది నా భవిష్యత్తంతా' అంటూ డబ్బు తగలేస్తున్నావు. ఏం డబ్బు ఖర్చుపెట్టేదని, ఆ రాయుడికి, పెద్ద వుద్యోగం దొరికింది? ఇంగిలీషు ముక్కలన్నా రెండురావు. యింతకీ, మేం చేసుకున్న అదృష్టం! బోలెడు ఖర్చుపెట్టి, మడిచక్క అమ్ముకుని, చదువు చెప్పించి, చివరికి తిండికి కూడా కష్టపడిపోతున్నాం. నువ్వు పనీపాటూ లేక పెళ్ళాంతో కబుర్లు చెప్పుకుంటూ నిర్భాగ్యపు దామోదర పెద్దమ్మవి తయారయావు' అంది.

రామారావుకి వొళ్ళుమండిపోయింది. ఏ చెయ్యగలడు! ఆ పాళంగా యిల్లువిడిచి పోదామనుకున్నాడు – కాని, కట్టుకున్న పెళ్ళాంగతి ఏమౌతుంది? అంచేత శాంతం వహించక తప్పిందికాదు.

సుబ్బ – తొంభైవక్క రూపాయలట వుద్యోగం. వాళ్ళ సంగతీ, సందర్భమూ చూస్తే ఎంత ముచ్చటయింది.

రామా – తొంభైవకటి జీతమా ఏం చదివేడని?

సుబ్బ – చదువెందుకూ, అదృష్టముండాలిగానీ.

రామా – నాకేమీ అర్థం కాలేదు. ఏముద్యోగం ఎక్కడేమిటి?

సుబ్బ – ఎక్కడేమిటి? యీవూళ్ళోనే. అదేం వుద్యోగమో, చదువులూ, చట్టుబండలూ యేడిసిన మీకు తెలియాలి, నాకేం తెల్సు?

రామా – ఇదంతా ఓ గారడీలాగుంది. యదార్థం తెలుస్తేగాని నమ్మకంలేదు.

సుబ్బ – అవును నీకు పనిలేకపోతే, ప్రపంచంలో మరి ఎవరికీ పనికాదనే వూహ ఏడిశావు దద్దమ్మవి (పోవును).

రామా – ఏ,బీ,సీ,డీలు రాని దద్దమ్మకి, 91 జీతమేమిటి, అదీ యిలాంటి పల్లెటూళ్ళోనే యేమిటీ, వీళ్ళంతా అది నమ్మి నన్ను ఎత్తి పొడవటమేమిటి? ఇదో నాటకంలాగుంది. రిసెర్చుచేసి ఫలితాలు కనుక్కోవాలి.

## 4

రాయుడు కుర్చీమీద కూర్చుని వుంటాడు. ఎదురుగా ఒక టేబిలు, పక్కని ఒక బెంచీ, రామారావు అక్కడికి వస్తాడు. రాయుడు 'కూచోరా, రామం' అని బెంచీ చూపిస్తాడు. కొడుకు హోదా చూడడానికి, తల్లి వచ్చి అక్కడే నుంచుంటుంది.

రామా – బాగుందిరా అబ్బీ నీ సంగతి. తొంభయ్యొక్క రూపాయల వుద్యోగం సంపాదించావట. మేం, ఏం చదివినా, నీ కాలిగోటికి పోలం.

వెంక – ఇది మీ అందరి దయా, వాడి అదృష్టమున్నూ – నీకు మాత్రం పని కాకపోతుందేమిటి రాముడూ.

రామా – ఏం ఉద్యోగమేమిటి రాయుడూ?

రాయు – నాయుడి మునసబులమీద కరణాల మీదా, రివిన్యూ ఇనస్పెక్టర్ల మీదా, అయి వుంటుంది. ఆ యింగ్లీషు మాటేమిటో నాకు అర్థం కాలేదు. నువ్వు చూసి చెప్పు.

అని యింట్లోకి వెళ్ళి కావిడిపెట్టి తాళం తీసి 10 కవర్లలో దాచిన ఆర్డరు కాగితం తెచ్చి రామారావు చేతిలో పెట్టాడు. దాన్ని చూడగానే రామారావుకి పట్టరాని నవ్వు వొచ్చింది. ఆపుకోలేకపోయాడు. 'యీ వుద్యోగమట్రా' అని నవ్వేసేడు – కడుపు చెక్కలయ్యేటట్లు.

రాయుడూ, తల్లీ నిర్ఘాంతపోయారు. కోపం కూడా కొంచెం వచ్చినట్టుంది, ఆ వాలకం చూస్తే. ఇంతలో, యేదో పుట్టి మునిగిపోయినట్లు బుచ్చెమ్మ కూడా వచ్చింది.

రాయు – యేమిరా అలా అంటున్నావ్?

రామా – ఇది, ఎన్యూమరేషను వుద్యోగం. జనాభా లెక్కలు రాయడం. దీనికి

జీతం, బత్తెం వుండవు. నెలకు 91 అంటే నెలకి తొంభయ్యొక్క రూపాయి జీతం కాదు. తొంభయ్యొకటో నెంబరు వాడివన్న మాట నువ్వు!

వెంక - ఐతే యిది వుద్యోగమేనా.

రామా - వుద్యోగమే - చెప్పలేదూ జీతం, బత్తెం వుండవనీ.

బుచ్చె - జీతం, బత్తెం లేని వుద్యోగం మీకెందుకండీ దండగ. నాకు అక్కర్లేదని రాసేయండి మేస్ట్రీటుకి.

రామా - అక్కర్లేదంటే వొదిలే వుద్యోగం కాదిది, చేసితీరాలి.

రాయు - ఇదా, నాకు మేస్ట్రీటుతో వున్న పరిచయానికి ఫలం?

వెంక - అక్కర్లేదంటే - యేం జేస్తాడేమిటి?

రామా - యేం జేస్తాడా? ఖైదులో కూచోపెడతాడు.

వెంక - బుచ్చె - రాయు - (వణుకుతూ) ఖై....దే?

***మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, జూలై 1937***